

# యెటుగు మింగిన శీకటి

సరింగ రొండు జాములకు అయిలయ్యా, ఆని పెండ్లం సత్తెమ్మ, పెద్ద కొడుకు పోశాలు కలిసి పెరట్ల గోడ గడ్తాంండ్రు. గా ఒక్క గోడ గడితె అల్లకది యింకో అర్రయితది. గింత గింజ గిరువు వోసుకుంటదుకు, ఎవుసం సామాన్లు బెట్టు కుంటందుకు అయిద్దని నాలుగైదు రోజుల సంది కట్టుకం మొదల్జేశింండ్రు. అయిలయ్య గోడ సౌకం జూసుకుంట కూని రాగం దీస్తాండు. "ఏటికి యాతం బెట్టి ఎయ్యిపుట్లు పండిస్తే ఎన్నదొాక మెతుకెరుగనన్నా, గంజిలొాక మెతుకెరుగ నన్నా. నా యాతె మెప్పుడు దీరు నన్నా......"

''ఆఁ సాల్ సాల్ పని గానియ్. ఎమో గిప్పుడే పదాలు సురూజేస్తివి పొందుగ గూసోని? నాకీడ నిలవడి నిలవడి ఒల్లు దిర్గుతాంది. పానం కులాసలేక..." యాష్ట కొచ్చింది సత్తెమ్మ.

సత్తెమ్మ కోపానికొత్తె, అయిలయ్య మన్సుల నగిండు. ఇంక జర్ర దిల్లగి జేద్దామనుకున్నడు.

అచ్చం ఆడిబట్లోనోలె నోరు దిప్పు కుంట "ఏందేయ్ ఒల్లుబాగ లేకుంటె మందు దింటనే ఉంటివి. కల్లుగిన దాగినవేమో ఒల్లు దిర్గ తాంది—

మందు దింటున్నాను మొగడో మందు దింటున్న.
మందు పత్తెం దీరెదాక మందలియ్యాకు
మడత రొట్టెలు పొంగె కల్లు
వూరి మీది కోడిపిల్లలు మందు దింటున్న.
ఆరు శేర్ల అరిసెంత పప్పు
నాన బోసి గారెల్జేసి మందు దింటున్న......"

—అయిలయ్య పాటకు సత్తెమ్మ మొకమంత, మాడు శెక్కోలె జేసు కున్నది. పోశాలుకు అయ్యపాట ఇశిత్రమనిపిస్తాంది. అయిలయ్య కుశయిండు. ఊటగా పదం మల్లందు కున్నడు.

"నానబోసి గారెల్జేశి
మందు దింటున్నాను మొగడో మందుదింటున్న.
పోరి కొక్కాటియ్యలేదు పొరసికి ఇయ్యలేదు,
కక్కు కుంటా ఒక్కదాన్నే మెక్కి తింటిని
గొర్రె కూర వొండుకొని మర్రికింద కూసోని,
మంచి కుండ కల్లు తోని మందు దింటున్నా..."

—అయిలయ్య పదం పురాగ్గాక ముందె సత్తెమ్మ తిట్టుడు సురూజేశింది.

"ఛ. పరాశ్కపోనోలె ఎంత చక్కని పదం బాడవత్తివి? సొక్కనయ్య. ఎన్కటి ముందట్కి ఎన్నడో గొర్రె కూర కల్లుకుండ దెచ్చి పెట్టినట్టు పాడ్తానవ్. ఏమన్న శరమున్నాది? నీ యవ్వ పంచి చ్చిందా? నీ యన్న పంచిచ్చిండా? పెయి మీది కట్టు బట్టతో నెల్లగొ్డ్తె

కష్టం జేస్కోని, శెమటబోసి యింత యిల్లు-వాకిలి జేసుకున్న ముందట్నించి గట్టదినే దాన్నయితే నువ్వు ఇయ్యాల్లటికి బుడ్డగోశి బెట్కోని యాడవోదువో సన్నాసులల్ల......" సత్తెమ్మ అయిలయ్య మీదికి ఎగవడ్డది. మొన్నటి దాక పండి పండి జెరంతోని, లేశి పన్జే త్తున్నా యింత యిదిలేదు. ఎక్కడ దిక్కుమాలినోనివో నాగండానికి దొర్కినవ్—" ఎగవడుడంత ఏడ్పయి పోయింది... సత్తెమ్మ యేడ్పు సూశి అయిలయ్య మన్సు నీల్లయ్యింది.

"ఎహె. ఏడ్వకు. నీయవ్వ. నేనేదో గమ్మత్కంటి-నివాద్గినె ఏడుస్త దేందిరా నీయవ్వ?—" పోశాల్ను సూసుకుంట అన్నడు అయిలయ్య. సత్తెమ్మను ఇగ ఏమనొద్దు: అంటనుకున్నాడు. సత్తెమ్మ లోపల్లోపట గునుస్తనే వుంది. 'నడీడు రాబట్టి పదాలు మానడాయె, సరసం మానడాయె;—' అన్కోని పదం యాజ్జేసుకోని, 'నీ పదంకునా బారేద్దు. యా జ్ఞోర్శిండో కన్నిద్దెల మారోడు' అనుకుంది.

ఎండేమో మా వూటగ గొడ్తాంది. కండల్గిరిగి శెమటయేటట్టు. ఇగ సత్తెమ్మ పెయ్యి బాగలేదు. గా మొన్నపేటకు బోయి దాక్సరు తాన సూదుల్దీస్కో నొచ్చింది. జెర్ర నయమైంది నిన్నియ్యాల్ల.

పోశాలేమో మన్ను కశ్కె పిశ్కె తొక్కి వొంగి పారతోని మన్ను గుంటి యిస్తాండు. శేత గాకున్న. శేశెటోల్లెవ్వల్లేరని-మన్నందు కోని ముద్దల్జేసి గోడమీద మొగన్కి యిశిరేస్తాంది సత్తెమ్మ. అయిలయ్య మన్ను తోడెం తోడెం దీసుకుంట, సర్సు కుంట గోడ పొందుగ వెడ్తాండు "బుద్వాలాడ వోయింది? జెర బిలువ్. పసుల నిడ్వాల్నాయె. పొద్దొంగ బట్టె, ఈడనేమె పని గాక పోతుండె—" అంటన్నడు అయిలయ్య.

'ముదనష్టప్పోరి ఏడవోయిందో ఏమోఁ నోరంతబోంగ బిల్సినారాదు." అని అన్కుంటనే బిల్శింది సత్తెమ్మ. "బుచ్చాలూ... ఓ బుచ్చాలూ... ఏడ సచ్చినవే నీ మీద మన్ను వడ! ఎదిగిన బిడ వున్నట్టేగని గీడున్న పుల్లి గాడ వెత్త దంటని అశ లేకపాయె–అన్కుంట తిడ్తనే వుంది.

బుచ్చాలు యాణ్ణించో ఉర్కొచ్చింది. బుచ్చాలుకు బుగులయింది. అయ్యైతే గోడ దిగి రాడు గని. అవ్వగిన కొడతదేమో నని...గింత సేపు ఒనమోల్లింట్ల ఓన గుంట లాడొచ్చినందుకు.

సత్తెమ్మ పని మీదుండె గాబట్కె జంగిలి మాటలు దిట్టి ఊరు కుంది. కని, కొట్టలే – గంతే సాలనుకుంది బుచ్చి.

"గా దొడ్లకు బోయి గొడ్ల నిడ్వు పో. జెర మేత మేస్తయ్."
కోపం దీరినంక అన్నది సత్తెమ్మ.

దొడ్డి యాణ్ణో లేదు. యింటి కాణ్ణించి పదడుగులేస్తే గదే- దొడ్లె శాన పసురం వుంది గని అయన్ని వీండ్లయి గావు. పైశ్వర సామియి, జట్ట లచ్మిగానియి, గుండెబొయిన మైసయ్యయి, నామాల యాది రెడ్డియి, కుకునూరి అనువాండ్లయి అందరియి గల్సున్నయ్

సుక్కలావు, పిల్లి కండ్ల బట్టె, పల్ల దుడ్డె, ఒంకర కొమ్ముల దున్న- గీ నాలుగే ఆయిలయ్యయి...

బుచ్చాలు మల్ల మాట్లాడకుండ గమ్మున ఎన్కకు దిరిగింది, అవ్వ జెప్పిన పని జేద్దామని-కని మల్ల ఒనమోలింటికే వొయి ఓన గుంట లాడ్దామని పిచ్చింది. అల్లింట్ల శిన్న బిడ్డ పేరు శెందిని. ఎన్నాట లాడ్తది? ఎన్ని పదాలు పాడ్తది? పోయి నేర్వమంటె సాలు యాష్ట లేకుండ శెప్తంది. ఇయ్యాల్ల అంబటాల్లప్పుడు పసందైన పదం బాడింది.

నాగ సరం బాడుకుంట
నడి బాటల కెల్లి రాంగ
నాగసరం నాదులకయ్యో నారామయ్యో
నడుములో జల్ జల్ మనెనయ్యో
పద్ద నాశు-ఆడవిలోనె,
నీ అడుగు గురుతు బట్టి,
మొగిలి పువ్వు అనుకోనయ్యో నా రామయ్యా,

మొక్కి వొల్లె దాసుకుంటయ్యా" పదం యాదికి రాంగనె మన్సంతా సల్లగయింది. రోజువొయ్యి రోజు కో పదం నేర్వాలె - అనుకుంది బుచ్చాలు.

ఓ పొల్లా...బుచ్చాలూ...

యింతలకే తల్లి మల్ల బిల్శినట్టుందని ఆగింది.

ఇగో మల్లగిట్ట ఎవ్వలింద్ల పొంటన్న దిరిగేవు. జెర శెప్పిన పని జెయి. మేపిద ఎండల పన్జేస్తాంటే నీకు ఊరి మీద బడి ఎట్ల దిరుగాలనిపిస్తాందే యిన్నవా ఆ — కూతేసి నట్టు శెప్పింది సత్తెమ్మ.

"ఆఁ యిన్న యిన్న. దొడ్లెకే బోతాన—" అంటని అడుగు లేసింది. తల్లి మల్ల బిల్శి మాట పాబందుగ శెప్పె తలకు ఇగ ఎటూ పోబుద్దికాలె- బుచ్చాలుకు

నివాద్గెనె అయ్యా. అవ్వా, పోశన్న ఎండల కట్ట బడ్తాండ్రు. తానేమో ఆటకు బోయింది. ముంద్గాల్నే కాలమయిత లేదు. శేశిన కట్టం గంగ పాలన్నట్టు ఏంజేశినా కడుపు నిండ్తలేదు. ఇంట్ల ఒక్క గింజ దాప్కం లేదు. ఇంక తన లగ్గం జేశెటందుకు యింట్లందరు ఎంత తిప్పలు పడ్తాండ్రో—

యింట్లెవ్వరు మంచి బట్ట గట్టరు.

"పద్దగ్గకో అంగి పట్టిచ్కో రాదుర—" అంట అయ్యెంటె- 'నీ యవ్వ నాకెందుకే వొల్లంత శిట శిట. బుచ్చాలుకు లంగదేంద్రి-" అంటన్నడు పోశన్న. ఇగ అవ్వ పెయ్యి మీద దారానికి రెండు నల్ల పూసలు, పుస్తె, పోతె ఇగేమి లేదు. గ్గా మొన్న పొలం నాటు వెడ్తాంటె మట్టెలు గూడ బురదల వొయినయి. గా శెంద్రయ్య పటేల్ పెడ్లాం కైతె గంటీలు, కత్తెరబోసీలు, దుద్దులు, కాకర్లు, తుత్తె, నాగసరం, కమ్మలు, గుండ్లు, వొడ్డాలం, పట్టగొల్సులు, కడాలు... ఇంక శాన శాన ఉన్నయ్ గని— అల్లది ఉప్పోల్లమ్ముచ్చట. తింటాన్కి కుండల కూడే పుండవాయె. గయ్యేఁడొన్నయ్? గిట్ల గిట్లనే పికరు జేసుకుంట గాన్నించి బుచ్చాలు పదడుగు లేశే తలికి, శెంద్రయ్య పటేల్ బాట వొంట వొయ్యెటోడు దెబ్బకు అగిపొయ్యిండు- బుచ్చాలు గనిపిచ్చింది! "ఓహో పొల్ల పెద్ద దయింది ఆఁ...' అని శెంద్రయ్య పూటగనే అన్నడు.

బుచ్చాలు దబ్బున మీదికి సూశింది. 'అమ్మో గివీడాఁ?'- అను కుంది. గుండెల బుగులయింది. శక్కరొచ్చినట్టయి, పక్కకు జరిగి గోడ పొంట బాడెమ్మటి బర్ర బర్ర ఉరికింది.

శెంద్రయ్యను సూశి బయపడెటందుకు, హిరన్నకాశిపుని తీర్గ ఏముండడు. గని నల్లగ బక్కాక పొడుగుంటడు. సీన్మల అడోల్ల నెత్క పోయ్యేటోని కుండే బుర్ర మీసాలు గూడలేవు. గని కండ్లెర్ర గుంటయి, గొంతు బొంగు.

బుచ్చాలు నడిశి పోతాంటె గమ్మతు గనిపిస్తాంది- శెంద్రయ్యకు. దాని ఒయసును దాశిపెట్ట శాతగాక నోర్లు తెర్సుకున్న సిరుగులు—గ్గా మొన్న నాత్రి పేటల దొరికిన కొత్త సరుకు బాపతుది కావాల్నని వాలా

యింది...... యెల్ల వెట్టిన సంగతి యాది కొచ్చి కుశయిందు. యెం బడే నగిందు.

సప్పుడిని, అయిలయ్య ఎన్కకు సూశిందు. ఊరి సర్పంచు శెంద్రయ్య పటేలు తన దిక్కే ఒస్తాందు.

సూడంగనె సూదుల్తోటి గుండెకాయ గుచ్చినట్టయింది. గని, మల్ల మీది కన్నడు "దండమయా. ఈ యాల్లవ్వుడెటో ఎల్లింద్రు?-"

''లేలే! ఎల్లేగని, ఏమాయె యింక గోడగానే లేదులే"

''యాడాయె పటేలా మొన్న సురువు జేశి కచ్చు లేపంగనె ఆన పెండ్లాం ముండవాయ్య, ఆనొచ్చి గోడంత తెర్లాయె. ఇగ అరాలని నిన్నూకోని ఇయ్యాల వెడ్తాన—" గోడ వెట్కుంటనే శెప్పిందు అయిలయ్య.

"సరెగని_ బాయికి మోటరు పెట్టించు కుంటరా లేదా? నువ్వు మీ తోటోండ్లు కూడుకోని, ఏ సంగతైంది శెప్పుంద్రి— ఇంతజాం జేస్త! మొన్నగా మన్నెం బాయికాడ మోదుగు మారిగానికి గంద్కం గంగన్కి మంజూరు జేపిచ్చిన. జేపిచ్చినా లేదా నలుగుర్నడుగు. గా ఏనుగు అనుమయ్యకు పూడ్కె బావుల అప్పు ఇప్పిచ్చిన నాకేమన్న ఒస్తున్నదా? ఊల్లె సర్పంచుగిరి ఉన్న కాడ్కి అందరికి మంచి జేయ్యాలని నా ఖాయిష మోటరు వెట్టించు కోంద్రి జల్దిన. ఇగ పొంటె గొట్టంగ లేశి, మోటలు గొట్టుడుండదు.—" అన్కుంట సర్సర ఎల్లి పోయిందు సర్పంచు.

అయిలయ్య ఆయన్దిక్కే సూశిందు సానసేపు. "పైసగల్లోండ్ది రాజ్జెం...... లాబ మొకనిదైతె కట్టమొకడు శెయ్యాలె—" అంట గుల్గిందు అయిలయ్య.

గోడ ఇవుతల్నించి పటేల్ మాటలన్ని ఇని "ఊఁ- ఎల్గ వెట్టిండు తీయ్—" సత్తెమ్మ యిసుక్కని యిసిరేష్టం యేస్తె, మల్లపోయి అయి లయ్య ఈపుల పడ్డది, మన్ను ముద్ద.

అదిరి పడ్డడు అయిలయ్య- ఎన్కకు సూస్కోని.

ఏందేయ్ నంజమీది కోపం గుంజ మీద్దీశినట్టు, నామీదే త్రివి? ముసల్దానానికి సర్ స మాడ్తాన్నావ్......" గట్లనే ఏమేమో గులుక్కు న్నడు అయిలయ్య. ఈపుల మన్ను దీసుకున్నడు.

పోశాలుగాడు శిన్నగ నగిండు. సత్తెమ్మ కిసుక్కుమన్నది.

గోడ వెట్కం జోరు జోరుగ అయితనే వున్నది. ఆకలిగూడ అంత జోరుగ అయితాంది. వాండ్లకు అంబటాల్లప్పుడు తాగిన గెంజి, నాలుగు మెతుకులు అరిగి శాన సేపయింది. ఇగ సత్తెమ్మ ఈన్నించి వోతె, గటొక్కండితె పొద్దీకి తినుడయితది. గని ఈపని యేడిదాడ పెట్టి బొయ్యేటట్టు లేదు.

తల్లి, కొడుక్కు- ఇప్పుడెండల లేరు. మెల్ల మెల్లంగ నీడ ఆల్ల మీదికి పాకొచ్చింది గిప్పుడు సొంతం-గోడ నీడలున్నరు.

ఉన్నట్టుండి ఒకసారి ఊల్లె ఉరోల్ల లొల్లి ఎక్వయింది. గదేం లొల్లో ఏందో అయిలయ్యకు తెల్వలె.

'వయ్యో! మంటలే. గుడిసెల్వాయెనే- అంట ఆడోల్లు, పిల్లగాల్లు మొత్తుకుంటున్న సప్పుడు యినవడి, గోడ మీద కూకున్నోడల్ల దెబ్బకు నిలవడి సూశిండు. ఊరి గుడిశెలన్ని కనిపిస్తనే వున్నయ్. ఊరి నడ్మ లచ్మిగాని గుడిశె అంటుకున్నది... ఏం ఆలోచన శెయ్యకుండ ఆత్రంగ గోడ దుంకి "ఇండ్లు గాల్తానయ్ రాండ్రి" అనుకుంట అయి

లయ్యె ఉరికిండు. ఉరుకంగ ఉరుకంగ తొవ్వకెదురుంగ, దమ్మొగ బోసుకుంట బిడ్డరాబట్టె- 'ఏందిబిడ్డ ఏమాయెనె'

బిడ్డకు ఏడ్పే గని మాట లొస్తలేవ్-

'పస్ల నిదుర్దామనుకునే తలికి, కొట్టమంటు కున్నదే, కాల్తాంది'

గా మాట యినంగనె అయిలయ్యకు తన బత్కు కాలినట్టని పిచ్చింది— గుండె గాలింది. ఉరికిండు ఊల్లె మందిని పిల్సుకుంట. గుంపులు గుంపులుగ వొయింద్రు.

మొగోల్లు వూల్లె తక్వమందున్ను. పొద్దుగాల శెల్కల పొంటి పొయినోల్లు యింక రాలె! ఉన్నోలయితె. కుండలు బిందెలు దెచ్చిన్ను బాయికాడ్కి.

పూరి గుడిసెలు గాబట్టి మంటలు బాగలేశినయ్. అటు యిటు అన్ని గుడిసెలకు అంటుకున్నయి- మంటలు మొగుల్ను తాకెటట్టు. ఆడోల్లు నీల్ శేదు తాంద్రు. మొగోల్లు సత్తనే వుంద్రు.

శెంద్రయ్య పటేలురు కొచ్చిండు- పటేలుది మిద్దె. దాని సుట్టు ఇంకో ఇర్వయిండ్లోల్లయి గూనయి. గవన్ని గటు గడ్డకు అలగున్నయ్. అయిట్ల వొంగ గీ గుడిశెలన్ని గాలెటట్టున్నయ్.

''పొయిండి... పొయింద్రి... ఓరి కొమిరిగా నువ్వుందొక్కని దబదబ శేదరాదుర— బుగులు వడకుంద్రి నేనున్న గద. ఊరు మంచి కోసానికి ఏమైన జేస్త గిప్పుడే యాదగిర్ని సైకిల్ మీద పేటకు దోల్న. ఫైరింజ నొస్తాందొచ్చు. ఆ నీల్ల కారోల్లు ఒచ్చేదాక కష్టవడి బదా యించు కుంటుండాలె! పొయింద్రి- శానాల్లు దెచ్చి పక్కపొంత చేద్రి. గిర్క పీంచే అంటె ఎన్నడు గావలె? శేవి పొయ్యింద్రి... పొయ్యింద్రి?—'' గట్టిగ అరుస్తాండు.

సూ స్త సూ స్తనే అందరొచ్చింండ్రు. సల్లార్పు తాండ్రు. గని ఎంత కేమయితది? గటు గెడ్డాములాయె, సొప్పాములాయె. నీల్లు దెచ్చి సల్లెదాకుంటాయి? బస్సున కాలిపోతానయి. గిటు గుడిసెల కప్పింది గూడ తాటాకు లాయె.

ముసలోల్లను, శిన్న పిల్లల్ను ఎత్కపోయి దూరం ఏశి ఒస్తాండ్రు ఒయిసోల్లు. గా గొల్ల మల్లేశం వోల్ల పోరడు!! సామి గాని పెండ్లాంమీద కాలెడ్డి మొద్దు వడ్డదంట జబ్బమీద... వాత ఆటంగ వడ్డది. ఇగ గా సాలె బాలిగానింట్ల గట్లనే అయ్యింది. ఇంటు జమాల్ గాని యిల్లంత యేడికాడికి కాలి కూలింది. ఏదో కొద్దిల సావులు తప్పినయి- వాండ్ల వాండ్లు ఎవలూ సావలె.

గాడ ఎవ్వలు గూడ, గదెవ్వనిల్లు అని సోంచాయి స్త లేరు. ఇంత వరకు వాల్ల వాల్ల నడ్మ శిన్న శిన్న జగడాలు అయినా గని,- అన్ని మర్శి ఆపతి కాలంల గిప్పుడయితె కల్శి నీల్లు వోస్తాండ్రు.

అయిలయ్యుండె గుడిశె గూడ మంటల్తోటి నగుతాంది. అది సూశిన అయిలయ్య, సత్తెమ్మల పానాలు మసైనయ్. అయిలయ్య, పోశాలు... ఇల్లు వాండ్లందరు, ఊల్లె వాండ్లు కొందరు నీల్లు వోస్తనే వున్నరు. అంద కుంట, మంటలురుకుతనే ఉన్నయి- ఉరు ఉరంత లొల్లి... దేసంల అన్ని జాగలల్ల ఉన్నట్టు- పేద పేదోల్ల యిండ్లనిండ మంటలే!

శెంద్రయ్య పటేల సంటోల్లు ధైర్నం శెప్తనే ఉన్నరు-పెద్దలు, జనానికి ఎదో ఓటి శెప్తనే వుంటరు. జనం సెప్పేది యినరు-మల్లి మాట్లాడ్తె అసలేసెప్ప నియ్యరు.

"నీయవ్వ గిది గా శెంద్రిగాని పనే! ఎవన్మీద కోపమొచ్చిందో, గుడిసె లంటు వెట్టిచ్చిండు-దొంగ బేకూబ్ గాడు-లఫంగి సన్నాసి...

బాగర్ల కొడుక్కు…" యిండ్లు గాలినోల్ల దాంట్ల ఎవలెవలో సెర్పంచును తిడ్తాండ్రు.

అయిలయ్య సుట్టున్న ఆయిదారిండ్లు అంటుకున్నయ్. సగానెక్కువ గూడెం బూడ్దయ్యే తల్కి గన గన మన్కుంట పైరింజన ఉర్కొచ్చింది. దాని మీద ఒచ్చిన మన్సులు సటుక్కున దిగి, పైపులు బయటికి దీశి ఖాయిలేశిండ్రు. ఇగ చాల్ జేసి-జెర్ర సేపట్ల అగ్గి మంటలార్పిండ్రు. బూడ్డి మిగిలిచ్చిన్రు. గని వాండ్ల యేడ్పు లార్పలె. వాండ్ల ఐత్కలు కాల్నయ్, కాలినట్టే ఉన్నయ్. సల్లార్పినా సల్లారినట్టు అనిపిస్త లేదు. సమదాన మయితలేదు.

అవ్, మల్ల-ఎట్లైతది గన్క! దొడ్లె జీవాలొక్కన్ని సచ్చె, మిగిల్నయ్ సుర్ర సుర్ర గాలంగ బెదిరి పాయె. ఇండ్లల్ల వున్న గింజ గిరువు బట్ట గుడ్డలు ఎవుసం సామాన్లు అన్నిటి తోటి గుడిసెల్ గుడిసెలే ఉంటానికి యీలుకాకుంద ఊడ్చుక పాయె! ఎవ్వన్కుండదు బాద?

"పటేల్ సాబ్ మీవోని తోటి మత్లబు అందంగనె లగెత్కొచ్చినం. జొర్ మంటల్ భి సల్లార్పినం. సూసొక్క! జెర్ర నువ్ మమ్ముల గూడ సూసొక్క వాలె. మాకూక్కడ కడ్పుంటది."-అంటన్నడు. సల్లార్పటందుకు వొచ్చినోల్లల్ల పెబ్బ.

"హహ్హహ… అయ్యయ్యొ సూసుకుంట సూసుకుంట"- పెళ్ళెంటు నగిండు. నవ్వెట్లొచ్చిందో, యాణ్ణించొచ్చిందో తెల్సుకోటం కష్టం.

"నా శేత్లే మున్నది? ఎవలెవలిండ్లార్పిండ్రో, వాండ్లే మిమ్ముల అర్సుకుంటరు… దాద్రి గట్టమా యింటి అరుగు మీద కూకుంటరు. కష్టపిచ్చిన… పురాగ అనకుమ్మందే- "పా-పా! పటేల సాలొద్దు లాయె బాగక నడ్వ"- అనుకుంట ఒక్కొక్కలు పైరింజనోల్లు సర్పంచు అడుగుల అడుగు లేసుకుంట వొయిండ్రు. ఈడ మల్లేశం కొడుకు సచ్చిండని, బంటు రాజయ్య తల్లి నడుము యిరిగిందని, బత్కెట్టు

లేదని, శేతులు కాల్లు గాలినోల్లు... వాండ్ల యింటివాండ్లు సోకాలు బెడ్తాండ్రు.

గుడిసెల మీదినుంచి మంటలు బోయి, పొగలొస్తానయ్. ఊరోల్లు గూడ, బగబగ మండిన బాదలను ఇప్పటిదాక కన్నీల్ల తోటి ఆర్పిండ్రు. గిప్పుడు కుములుకుంట, మూలుక్కుంట కూకున్రు. పొగ ఆసోంటి దేదో గుండె లోపట్నుంచి బయ లెల్తాంది. పీలు బొబ్బ లెక్క అరుస్తాంటె వాండ్లు తాగు కుంట పండ్ల తోటి బొక్క లిరుస్తాండ్రు.

ఇగ జెర్ర గాంగనె, శెంద్రయ్య పటేలు పైరింజనోల్ల పెబ్బ ఇద్దరు ఊల్లె దిర్గుతాండ్రు సర్పంచు శెప్తాండు. "గంత దూరం నుంచి వొచ్చిండ్రీల్లు... ఈల్లకేమన్న ఒప్ప జెప్పాలె. రూపాయల్దీసి పెట్టుండ్రి సచ్చినోలను, దెబ్బల్దాకినోల్లను, కాలినోల్లనేం జూస్తరు? అల్లకు గట్ల గీత రాసుంది... ఈల్లను తొందర్గ సాగనంపాలె!"- సెప్పుకుంట బొటపొంటి దొరలెక్క నడుత్తాండు శెంద్రయ్య.

మాట్లాడేటందుకే సాతనయిత లేదు. ఇగ మర్ల వడ్తారు? సర్పంచు శెంద్రయ్య సర్పమసోంటోడు. పొంగ ఎవ్వలేడ్పు లాల్లకున్నయ్.

ఒక్క రాజయ్యేడిగిండు. దైర్నం జేసి- "ఇగ మా తానే మున్నయ్ పటేల మా పాణాల్దప్ప?-" ఏడ్సుకుంట.

"గయ్యో ఇయ్య, మల్ల- పెండ్లాం లేదుర దాన్నమ్మి పైసదే"- ఇంక బగ్గ శెడ్డ మాటలు తిట్టిండు.

నోరు గల్లోన్ని ఊరు గదామల్ల-

సచ్చిన పీన్గను గాల వెట్టేటందుకు, వొల్లుగాలినోల్ల బాగ జేయించేటందుకు కొత్త ల్లేవు. ఇగ గీల్ల కిచ్చే టందుకెన్నించొస్తయ్ వాండ్లకు.

గట్ల అరుసుకుంటనే అయిలయ్య తాని కొచ్చిండు. "సూడు అయిలయ్య మంటల్గిట్ట ఆపు జేశిన సాబ్ లొచ్చిన్రు. అల్లు సల్లార్పకుంటె ఈ ఆపతిల ఆదు కోకుంటె, మన మంత యాడుందుం? అల్లకు మనం రునపడి ఉన్నం. ఎంత సన్న ముట్ట జెప్పు కోవాలె. తయారు జెయ్."

"తయారు జేశెటందేమున్నది. నీకాల్లు మొక్కుత. పెండ్లాం పుస్తె మిగిలిచ్చి..."

"గదైతె గదే సంయ్. ఇయ్యాలె! మల్ల వీండ్లు ఉత్తగ పోతారు? గిది ఎవ్వల్కి తప్పదు. ఉన్నోన్ని లేనోన్ని సమానంగ జూస్త. అందరి తాన ఒ సూలు జేస్తానం. ఎల్లకుంటె ఇగో వీండ్ల వాల్లొచ్చి ఏద్దారికితె గదే తీస్కపోతరు."- కదిలిండు పటేలు.

పైరింజనాయిన శిన్నగ నగిండు-ఊకుకుంట పటేలెన్క పో తాండు.

"నీయవ్వ దునియ! పుస్తె అయిన సరే ఇయ్య మనే అరిచ్చంద్రు లున్న రియాలేరి పు-ధూ!"

-అనుకున్నడు అయిలయ్య.

సత్తెమ్మ. పోశాలు కొట్టం కాడున్నరు. కాలినింట్ల ఏమే మున్నయో దేవులాడ్తాంది బిడ్డ బుచ్చాలు.

పక్క గుడిశె కాడ గిట్లనే బెదిరిత్తాండ్రు-ఈ న్నించి వొయినోల్లు! కడుపుల పేగు లేడుస్తున్న సప్పుడయితాంది.

"గిదొక్కటే ఉన్నదే నాయిన"- ఏడ్పు గొంతు తోటి అను కుంట, లంగ పిడికి చెక్కుకోని, కాలిన కట్టెలూ, బూడిద, శెత్త, దాటుకుంట కాలి నింట్ల నుంచి బయటి కొస్తాంది బుచ్చాలు.

అవుతల వాండ్లు, పీన్గల సుట్టు నక్కల్దిరిగినట్టు. గుడిసెలన్ని తిరుగుతనే వున్రు.

గుడిసెలు కాలినోల్ల బత్కులు గిట్లయిన యని, కండ్ల వడె టట్టు గట్క కుండది పట్గిన టోకె బుచ్చాలు శేతుల ఉన్నది.

వేకువ-

ఆంధ్ర జ్యోతి

4-10-1974.